ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేది: 23.05.2026 సమయం: 18.10 గంటలు

ముఖ్యాంశాలు

1. తిరుమల తిరుపతి దేవస్థానం తరహాలోనే యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి ఆలయాన్ని స్వయం ప్రతిపత్తి గల దేవస్థానంగా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు.

2. రాష్ట్ర అభివృద్ధిలో ఫ్యూచర్ సిటీ కీలక పాత్ర పోషిస్తుందని ఐటి , పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు అన్నారు.

3.శాంతి భద్రతల నిర్వహణ , నేర పరిశోధనలను మరింత బలోపేతం చేయడానికి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలని డీజీపీ సివి ఆనంద్ పోలీస్ అధికారులను ఆదేశించారు.

4. రాబోయే నాలుగు రోజుల్లో తీవ్ర వడగాలులు వీస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రెవెన్యు శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సూచించారు.

**REVANTH REDDY- YADAGIRI GUTTA**

తిరుమల తిరుపతి దేవస్థానం తరహాలోనే యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి ఆలయాన్ని స్వయం ప్రతిపత్తి గల దేవస్థానంగా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. భక్తులకు త్వరగా దర్శనమయ్యేలా క్యూలైన్ల క్రమబద్ధీకరణ , హుండీ ఆదాయం , విరాళాలు, లడ్డుప్రసాదం తయారీలో ఉన్నతప్రమాణాలు పాటిస్తామని ముఖ్యమంత్రి

పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈరోజు శ్రీలక్ష్మీ నరసింహ స్వామిని దర్శించుకున్నారు. అనంతరం సుమారు 100 కోట్ల రూపాయల వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. 43 కోట్ల 80 లక్షల రూపాయలతో నిర్మించనున్న వేద పాఠశాలకు కంచి కామకోటి పీఠాధిపతి విజేయంద్ర సరస్వతితో కలిసి భూమిపూజ నిర్వహించారు. అలాగే నిత్య కల్యాణ మండపం, వైకుంఠ ద్వారం నుంచి కొండపైకి వెళ్లే మెట్ల మార్గానికి పైకప్పు , రథశాల వైపు మాడవీధులకు మెట్లు , డార్మిటరీ హాల్స్ , దీక్షాపరుల సదన్ నిర్మాణాలకు కూడా ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు.

ముఖ్యమంత్రితో పాటు శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి , దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, అడ్లూరి లక్ష్మణ్, పలువురు ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

పీటీసీ, భువనగిరి

**శ్రీధర్‌బాబు**

రాష్ట్ర అభివృద్ధిలో ఫ్యూచర్ సిటీ భవిష్యత్తులో కీలక పాత్ర పోషిస్తుందని ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే ఫ్యూచర్ సిటిని తాము అధికారంలోకి వస్తే రద్దు చేస్తామని బీఆర్ఎస్ నేత హరీష్ రావు వ్యాఖ్యానించడం పట్ల మంత్రి అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రతిపక్షాల వైఖరి వల్ల రాష్ట్రానికి పెట్టుబడులు రావని, దాంతో రాష్ట్ర అభివృద్ధి కుంటుపడుతుందని ఆయన అన్నారు. అలాగే జంట నగరాలకు సంబంధించిన మెట్రో రైలు ప్రాజెక్టును విస్తరించడానికి ప్రభుత్వ ప్రయత్నాలను బీఆర్ఎస్ అడ్డుకుంటోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

డెస్క్

**పొంగులేటి**

రాబోయే నాలుగు రోజుల్లో తీవ్ర వడగాలులు వీస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపధ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రెవెన్యు శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

సూచించారు. రాష్ట్రంలో హీట్ వేవ్ పై హైఎలర్ట్ నేపథ్యంలో మంత్రి అత్యవసర సమీక్షను నిర్వహించారు. తీవ్ర వడగాలులు వల్ల ఏడు జిల్లాల్లో 16 మంది మృతి చెందిన నేపథ్యంలో ప్రజలు ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు బయటకు రావొద్దని మంత్రి సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు మృత కుటుంబాలకు 4 లక్షల రూపాయల ఎక్స్ గ్రేషియా ప్రకటించారు. హీట్ వేవ్ పై గ్రామ స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్లను మంత్రి ఆదేశించారు.

డెస్క్

**డీజీపీ సివి ఆనంద్**

రాష్ట్రంలో శాంతి భద్రతల నిర్వహణ, నేర పరిశోధన, పోలీస్ వ్యవస్థ సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేయడానికి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని, కృత్రిమ మేధస్సును విస్తృతంగా వినియోగించాలని డీజీపీ సివి ఆనంద్ పోలీస్ అధికారులను ఆదేశించారు. కేసుల దర్యాప్తులో సాంకేతికతను వినియోగించడం ద్వారా వేగవంతమైన, పారదర్శకమైన, ఖచ్చితమైన సమాచారాన్ని రాబట్టవచ్చని ఆయన అన్నారు. అలాగే సైబర్ నేరాలు, డ్రగ్స్ మాఫియా వంటి నేరాల కట్టడికి ప్రత్యేక నిఘా వ్యవస్థను ఏర్పాటు చేస్తామని ఆయన పేర్కొన్నారు. ట్రాఫిక్ సమస్యల పరిష్కారం కోసం ట్రాఫిక్ మేనేజ్ మెంట్ అండ్ రోడ్ సేఫ్టీ బ్యూరో ఏర్పాటు చేస్తామని ఆయన వెల్లడించారు.

డెస్క్

**ఐఐటీ హైదరాబాద్**

భవిష్యత్ సాంకేతికత , సామర్థ్యాలు, నూతన ఆవిష్కరణలు దేశాన్ని శాస్త్ర విజ్ఞాన పరంగా ముందుకు నడిపించడంలో కీలక పాత్ర పోషిస్తాయని ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్ ప్రొఫెసర్ బి.ఎస్. మూర్తి అన్నారు. ప్రపంచ స్థాయి పరిశ్రమలు – ఉన్నత విద్యా సంస్థల భాగస్వామ్యం ఇందులో ప్రముఖ పాత్ర పోషిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఐఐటీ హైదరాబాద్ , జపాన్‌కు

చెందిన ఏజీసీ సంస్థ సంయుక్తంగా AAPI ఇన్నోవేషన్ హబ్ ను ఈరోజు ప్రారంభించాయి. భారత్-జపాన్ దేశాల సాంకేతిక సహకారంతో ప్రారంభమైన ఈ హబ్ ముఖ్య లక్ష్యాలు. డిజిటల్ ట్రాన్స్ ఫర్మేషన్ రంగంలో ప్రతిభను పెంచడం , పరిశ్రమ-విద్యాసంస్థల మధ్య బంధాన్ని బలోపేతం చేయడం.

దీని ద్వారా విద్యార్థులు , పరిశోధకులకు అంతర్జాతీయ స్థాయి ఇంటర్న్ షిప్‌లు, సంయుక్త పరిశోధనల్లో భాగస్వామ్యం లభిస్తుంది. భారతదేశంలోని అద్భుతమైన డిజిటల్ ప్రతిభను గుర్తించిన ఏజీసీ సంస్థ AI, ఆధునిక ఇంజినీరింగ్ వంటి రంగాల్లో పరిశోధనలు చేయనుంది. భవిష్యత్ సాంకేతిక ఆవిష్కరణలను ముందుకు తీసుకెళ్లడానికి ఇలాంటి అంతర్జాతీయ పారిశ్రామిక భాగస్వామ్యాలు ఎంతో అవసరమని ఏజీసి జనరల్ మేనేజర్ ఇవకురా పేర్కొన్నారు.

**పిటిసి, సంగారెడ్డి**

**నీట్ యూజీ**

నీట్ యూజీ పరీక్ష రాసే అభ్యర్థులకు ఎన్ టి ఏ కీలక సూచన జారీ చేసింది. నీట్ పరీక్ష రద్దు కావడంతో విద్యార్థులకు ఫీజు రిఫండ్ చేస్తున్నట్లు పేర్కొంది. ఈ మేరకు ఫీజ్ రిఫండ్ కోసం ఈనెల 27 లోపు బ్యాంకు ఖాతా వివరాలు సమర్పించాలని అభ్యర్థులకు సూచించింది. మరోసారి రాసే నీట్ పరీక్షకు మళ్ళీ ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది.

డెస్క్

**రాజన్న సిరిసిల్ల బైట్**

కార్మికుల సుదీర్ఘ పోరాట ఫలితంగానే ప్రభుత్వం వేతనాల పెంపుపై నిర్ణయం తీసుకుందని సీఐటీయూ రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రధాన కార్యదర్శి కోడం రమణ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పెంచిన కనీస వేతనాలను జూన్ 1 నుంచి కంపెనీ యజమానులు తప్పనిసరిగా అమలు

చేయాలని కోరారు. జిల్లాలోని సిరిసిల్ల సీఐటీయూ కార్యాలయంలో ఈరోజు నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ...

బైట్ ... కోడం రమణ, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి

పిటిసి, రాజన్న సిరిసిల్ల

**బక్రీద్**

రాష్ట్ర ప్రభుత్వం బక్రీద్ పండుగ సెలవు తేదీలో మార్పు చేసింది. పాత క్యాలెండర్ ప్రకారం మే 27న ఉన్న సెలవును మే 28 కి మార్చినట్లు అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది.

డెస్క్

**పీఎం సూర్య ఘర్ యోజన**

కేంద్ర ప్రభుత్వ పథకాలైన పీఎం సూర్య ఘర్ యోజన , పీఎం కుసుమ్ పథకాలపైన ములుగు జిల్లా కేంద్రంలో రైతులు , గ్రామస్తులు, వ్యాపారస్తులకు ములుగు లో రెడ్కో జిల్లా మేనేజర్ జనార్దన్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు . సోలార్ విద్యుత్ ఉత్పత్తి , వినియోగం, డిస్కమ్ లకు సరఫరా చేసి ఆదాయం పొందే మార్గాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...

బైట్ ... రెడ్కో జిల్లా మేనేజర్ జనార్దన్

పిటిసి, ములుగు

**వాతావరణం**

నైరుతి రుతుపవనాలు వేగంగా కదులుతున్నాయని భారత వాతావరణ శాఖ వెల్లడించింది. రుతుపవన మేఘాలు అరేబియా సముద్రం , బంగాళాఖాతంపై దట్టంగా ఆవరించి ఉన్నట్లు శాటిలైట్ చిత్రాల ద్వారా గుర్తించినట్లు పేర్కొంది. ఈ రుతుపవనాలు కేరళం వైపు కదులుతూ

వేగంగా బలపడుతున్నాయని,   దేశంలో సకాలంలో రుతుపవనాలు సకాలంలో ప్రవేశించే అవకాశం ఉందని అంచనా వేసింది.

డెస్క్

**సజ్జనార్**

దేశంలోనే తొలి ఏఐ ఆధారిత కంప్లైంట్ రికార్డర్ కాపీ రైటర్ యాప్ ను హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ విసి సజ్జనార్ ఆవిష్కరించారు. జిహెచ్ఎంసి పరిధిలోని 80 కి పైగా పోలీస్ స్టేషన్లలో ఇది అందుబాటులోకి రానుంది.   హిందీ, తమిళం, బెంగాలీ, మరాఠీ వంటి పది భాషల్లో మాట్లాడితే అది వెంటనే రాతపూర్వక రూపంలోకి మారుతుంది.   తర్వాత పోలీసులకు అర్ధమయ్యే భాష లోకి అనువాదం అవుతుంది. వలస కార్మికులు, పర్యాటకులు, మహిళలు, వృద్ధులకు ఇది ఎంతో సదుపాయంగా ఉంటుందని సజ్జనార్ అన్నారు. ఎఫ్ఐఆర్ ప్రక్రియను సులభతరం చేసే ఈ యాప్ వినియోగం వల్ల న్యాయానికి భాష అడ్డంకి కాదు అని అనే అంశం వెల్లడిస్తుందని సజ్జనార్ అన్నారు.

డెస్క్

**రాంచందర్‌రావు**

ఈనెల 25 నుంచి ‘రైతు గోస - భాజపా భరోసా’ పేరిట రైతు చైతన్య కార్యక్రమాలను భారతీయ జనతా పార్టీ రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించనుంది. ఇందులో భాగంగా   బిజెపి రాష్ట అధ్యక్షుడు రామచందర్ రావు ఆధ్వర్యంలో  ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద పార్టీ ఎంపీలు , ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు నిరసన తెలపనున్నారు. రైతులతో ముఖాముఖి నిర్వహించనున్నారు.

డెస్క్